

## షూటింగ్ చాంపియన్ సయ్యద్ మునావర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) వేదికగా జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) షూటింగ్ చాంపియన్‌షిప్‌లో యువ షూటర్ సయ్యద్ మునావర్ హుస్సేన్ 10మీటర్ల విభాగంలో స్వర్ణ పతకంతో మెరిశాడు.

## ఏషియన్ ముక్తా సంస్థలకు టోకరా

### బోగస్ బ్యాంక్ అకౌంట్లతో ఉద్యోగి మోసం

### సినీ నిర్మాత ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, అక్టోబర్ 26: బోగస్ కంపెనీల పేర్లతో బ్యాంక్ అకౌంట్లను సృష్టించి.. ప్రముఖ సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సునీల్ నారంగ్‌కు చెందిన అకౌంట్‌నుంచి డబ్బులు కాజేసిన ఉద్యోగితో పాటు మరో ఇద్దరిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. పోలీసుల వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 31లో ఏషియన్ ముక్తా ఏ-2 సంస్థ పేరుతో నిర్మాత సునీల్ నారంగ్ కార్యాలయం నడిపిస్తున్నారు. ఇందులో విశ్వనాథరెడ్డి అనే వ్యక్తి గత ఏడేళ్లుగా అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. గత కొన్నేళ్లుగా విశ్వనాథరెడ్డి.. తన భార్య సఫియా నసీర్, స్నేహితుడు శశాంక్‌తో కలిసి కొన్ని బోగస్ సంస్థల పేర్లతో బ్యాంక్ అకౌంట్లు తెరిచారు. హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, సాయి నైన్ ఎంటర్‌ప్రైజెస్, తదితర పేర్లతో ఉన్న ఈ బ్యాంకు ఖాతాలకు పలు సందర్భాల్లో డబ్బులు పంపించారు. బోగస్ లెక్కలు చూపిస్తూ ఆయా సంస్థల పేర్లమీదకు రూ.1.47కోట్ల మేర నిధులు పంపించినట్లు ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో తేలింది. ఏషియన్ సంస్థ సీఎఫ్‌వో రాజశేఖర్ యాదవ్, సీఈవో వరుణ్ మల్హోత్రా, మేనేజింగ్ పార్ట్‌నర్ సునీల్ నారంగ్ పేర్లతో చెక్కులు తీసుకుని డబ్బులు తమ ఖాతాల్లోకి మళ్లించినట్లు తేలింది. దీంతో తమ సంస్థను మోసం చేసిన విశ్వనాథరెడ్డితో పాటు సఫియా నసీర్, శశాంక్, తదితరులపై చర్యలు తీసుకోవాలంటూ నిర్మాత సునీల్ నారంగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అద్దెకు ఇచ్చిన ఇల్లు కూల్చివేత


### అడ్డుకునేందుకు జేసీ దివాకర్‌రెడ్డి వెళ్తే బెదిరింపులు

### కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్,అక్టోబర్ 26: తమ వద్ద అద్దెకు తీసుకున్న ఇంటిని.. వేరొకరికి ఇచ్చే ప్రయత్నాల్లో భాగంగా కూల్చివేతలు చేపట్టడంపై ప్రశ్నించేందుకు వెళ్లిన మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి, మేనేజర్‌లను బెదిరింపులకు గురిచేయడంతోపాటు దాడికి యత్నించారు. ఈ సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్‌రెడ్డికి జూబ్లీహిల్స్ రోడ్ నం.62లోని ప్లాట్ నంబర్ 1250లో ఉన్న ఇంటిని సాహితీ సంస్థ చైర్మన్ బూదాటి లక్ష్మీనారాయణకు 2020లో అద్దెకు ఇచ్చాడు. మూడేళ్ల గడువు ముగిసిన తర్వాత ఇంటిని ఖాళీ చేయాలని కోరగా.. బూదాటి కొడుకు సాత్విక్ మిస్టిక్ వెల్‌నెస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ బోగస్ అగ్రిమెంట్‌ను సృష్టించి కోర్టులో కేసు వేశాడు. ఈ వ్యవహారంపై గతంలోనే సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం జేసీ దివాకర్‌రెడ్డితోపాటు అతడి మేనేజర్ జగదీశ్ యాదవ్‌లు ప్లాట్ నంబర్ 1250లో ఉన్న ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న ఇంటిని కూల్చేసి స్థలాన్ని చదును చేస్తున్నట్లు గుర్తించిన జేసీ షాక్‌కు గురయ్యారు. ఏడాది కాలంనుంచి అద్దె చెల్లించకపోవడంతో పాటు కోర్టులో తప్పుడు పత్రాలతో కేసులు వేశారని, తమ అనుమతి లేకుండా ఇంటిని ఎలా కూలుస్తారంటూ అక్కడున్న రాజీవ్ సాల్మన్ అనే వ్యక్తిని ప్రశ్నించారు. దీంతో రాజీవ్ సాల్మన్‌తో పాటు ఇతర వ్యక్తులు జేసీ దివాకర్‌రెడ్డి, జగదీశ్ యాదవ్‌లను అక్కడినుంచి వెళ్లిపోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంటిని కూల్చిన ఫొటోలు తీసేందుకు యత్నించడాన్ని అడ్డుకున్నారు.ఈ స్థలాన్ని సినిమా వాళ్లకు అద్దెకు ఇచ్చారని, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసేందుకు యత్నిస్తున్నారంటూ జగదీశ్‌యాదవ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

బంజారాహిల్స్, అక్టోబర్ 26: మెడికల్, ఇంజినీరింగ్ సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించి పలువురు బాధితుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన మోసగాడిపై జూబ్లీహిల్స్ పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీనగర్ కాలనీలో రోహిత్ అనే వ్యక్తి ఆరునెలల క్రితం చెక్‌మేట్ కన్సల్టెన్సీ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేశాడు. విదేశాల్లో మెడిసిన్ సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాలో ఇంజినీరింగ్ సీట్లు ఇప్పిస్తానంటూ నమ్మించి పలువురివద్దనుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. అయితే నెలలు గడిచినా సీట్లు రాకపోవడంతో పాటు రోహిత్ బిచాణా ఎత్తేయడంతో శనివారం పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. రంగారెడ్డి నగర్‌కు చెందిన పరశురామ్ కుమార్తెకు ఈ కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటా కింద సీటు ఇప్పిస్తానంటూ రూ.12లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. కృష్ణదేవరాయనగర్‌కు చెందిన పాగల నందిని వద్దనుంచి విదేశాల్లో ఉద్యోగం పేరుతో రూ.7లక్షలు వసూలు చేయగా, శ్రీనగర్ కాలనీకి చెందిన రచ్చ నవిత కుమార్తెకు వైజాగ్‌లోని గీతం యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానంటూ రూ.15లక్షలు వసూలు చేశాడు. ఆఫీసు ఏర్పాటు కోసం అంటూ అనురాధ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న రావి గౌతమి వద్దనుంచి రూ.70లక్షలు తీసుకున్న రోహిత్.. వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేశాడు. ఇటీవల గట్టిగా డబ్బులు ఇవ్వాలని కోరగా బాండ్ పేపర్ రాసిచ్చి అక్టోబర్ 25లోగా ఇస్తానంటూ హామీ ఇచ్చాడు. అయితే డబ్బులు ఇవ్వకపోగా ఆఫీసు మూసేసి పరార్ కావడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసులు నమోదు చేశారు. రోహిత్ చేతిలో మోసపోయిన బాధితులు వందల సంఖ్యలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



**అభినందన..**

విస్టా ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలను శనివారం అభినందిస్తున్న భారత మాజీ వాలీబాల్ ప్లేయర్ కిరణ్‌రెడ్డి



మూడు నెలల క్రితం కంకర పోసి వదిలేసిన సామనగర్ కాలనీ రోడ్లు

# కంకరపోసి..పని ఆపేసి..

- నిధులైపోయాయని రోడ్డు పనులు మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- మూడు నెలలుగా సామనగర్ వాసుల అవస్థలు
- రెండు డివిజన్ల మధ్య సమన్వయ లోపంతో సమస్య

వనస్థలిపురం, అక్టోబర్ 26: గత కొన్నేళ్లుగా గుంతల రోడ్లతో బాధపడుతున్న వారికి రోడ్డు మంజూరయ్యింది. కాంట్రాక్టర్ పని మొదలు పెట్టాడు. రోడ్డును తవ్వి, దొడ్డు కంకర కూడా పోశారు. ఆ కాలనీవాసులు ఎంతో సంతోషంగా ఉన్నారు. కానీ కంకర పోసిన కాంట్రాక్టర్ పనులు ముందుకు సాగనివ్వలేదు. మూడు నెలలుగా అధికారులు, నాయకులు చుట్టూ తిరిగినా ఫలితం లేదు. గుంతల రోడ్లతో ఎలాగోలా నెట్టుకొచ్చిన వారికి ఇప్పుడు ఇంటి ముందర కంకర మరింత సమస్యగా మారింది. ఇది బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని సామనగర్‌లో రెండు రోడ్ల పరిస్థితి.

### రెండు డివిజన్ల మధ్య సమన్వయలోపం

సామనగర్ కాలనీ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్, హయత్‌నగర్ డివిజన్‌ల సరిహద్దులో ఉంది. మూడు నెలల క్రితం హయత్‌నగర్ డివిజన్ నుంచి రూ.52లక్షలు సీసీ రోడ్డు నిర్మాణానికి మంజూరయ్యాయి. ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సామనగర్‌లోని సరిహద్దు కాలనీలో పనులు మొదలు పెట్టాడు. రోడ్డును తవ్వి దొడ్డు కంకర పోశాడు. ఇంతలోనే జోక్యం చేసుకున్న హయత్‌నగర్ కార్పొరేటర్ తమకు మంజూరైన పనులను తమ డివిజన్ పరిధిలోనే చేపట్టాలన్నాడు. దీంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేసి మరోచోట రోడ్లను నిర్మించారు. నిధులు అయిపోయాయని కంకర పోసిన రోడ్డును వదిలేశారు.

### అవగాహనా రాహిత్యం.. ప్రజలకు శాపం

పనులు చేపడుతున్నప్పుడు దగ్గరుంచి చూసుకోవాల్సిన అధికారులు కనీసం పట్టించుకోకపోవడం వల్లనే సమస్య జఠిలంగా మారింది. స్థానిక అసిస్టెంట్ ఇంజినీర్ పర్యవేక్షణలు పనులు చేయాల్సి ఉండగా, సదరు ఏఈ కనీసం అందుబాటులో కూడా ఉండడనే విమర్శలు వినిపిస్తున్నారు. ఆయన నిర్లక్ష్యం కారణంగా అటువైపు చేపట్టాల్సిన పనులు ఇటు చేపట్టి, మధ్యలో వదిలేశారు. ఇళ్లముందు కంకరతో మూడు నెలలుగా ప్రజలు నరకయాతన పడుతున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### మా అవస్థలను పట్టించుకోవడం లేదు



మా ఇంటి ముందు రోడ్డు వస్తుందని ఎంతో ఆశపడ్డాం. కానీ ఇలా కంకర పోసీ ఉన్న సమస్యను మరింత పెద్దది చేస్తారనుకోలేదు. ఇంటి ముందు కంకర వల్ల పిల్లలను బయటకు పంపేందుకు భయం అవుతోంది. మూడు నెలలుగా ఎన్నో అవస్థలు పడుతున్నాం. అధికారులు, నాయకులకు ఎన్ని సార్లు చెప్పినా మా అవస్థలను పట్టించుకోలేదు. ఇప్పటికైనే వెంటనే పనులు చేపట్టి సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నాం.

– కె.రాధిక, సామనగర్

### ప్రతిపాదనలు పంపించాం

రెండు డివిజన్‌ల మధ్య ఉన్నందున రహదారుల నిర్మాణంలో సమస్య తలెత్తింది. హయత్‌నగర్ డివిజన్‌లో పూర్తి చేశాం. ఇక్కడికి నిధులు సరిపోలేదు. సామనగర్‌లోని రెండు రోడ్లకు రూ.14లక్షల అంచనాతో ప్రతిపాదనలు పంపడం జరిగింది. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

– దామోదర్ రావు, జీహెచ్ఎంసీ, డీఈ

## ఆర్చరీలో స్వర్ణ పతకాలు సాధించిన జువైనల్ చిన్నారులు

సైదాబాద్, అక్టోబర్ 26: తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో బాలుర సదనం (సైదాబాద్ జువైనల్ హోం)కు చెందిన ఇద్దరు చిన్నారులు ఆర్చరీలో తమ సత్తాను చాటి జిల్లా స్థాయిలో రెండు స్వర్ణ పతకాలు సాధించారు. హైదరాబాద్ జిల్లా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో రూబెన్ స్వర్ణ పతకం (మొదటి స్థానం) దక్కించుకోగా, రంగారెడ్డి జిల్లా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో అశోక్ స్వర్ణపతకం (మొదటి స్థానం) దక్కించుకున్నారు. ఈనెల 28,29 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర మీట్‌లో ఈ ఇద్దరు చిన్నారులు ఆర్చరీ విభాగంలో పాల్గొంటారని బాలుర సదనం అధికారులు తెలిపారు. ఇద్దరు చిన్నారులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జువైనల్ వెల్ఫేర్, కరెక్షనల్ సర్వీసెస్, వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మిర్జా అలీ బేగ్ అభినందించారు.



హైదరాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన బాలుడికి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

## ప్రభుత్వ పాఠశాల భూమిని పరిరక్షిస్తాం



కార్పొరేటర్ చింతల అరుణకు వినతిపత్రం సమర్పిస్తున్న బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు

మన్సూరాబాద్, అక్టోబర్ 26: రెవెన్యూ, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వలన అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ పాఠశాల భూమిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు శనివారం నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గతంలో తాసీల్దార్ సర్వే చేపట్టి ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వ పాఠశాల భూమి సర్వేనం. 36/6లో ఉందని తేలిందన్నారు. ఈ విషయంపై కొందరు ప్రైవేటు వ్యక్తులు కోర్టుకు వెళ్లగా రెవెన్యూ అధికారులు, విద్యాశాఖ అధికారులు సరిగా స్పందించలేదని తెలిసిందన్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ పాఠశాల భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే పరిస్థితి తలెత్తిందన్నారు. పాఠశాల స్థలాన్ని పరిరక్షించేందుకు జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత ప్రజా ప్రతినిధులను కలుసుకుంటానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతల సురేందర్‌యాదవ్, బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు సహదేవ్‌గౌడ్, పంగ గౌతమ్, కందికంటి రాఘవేందర్‌గౌడ్, మెట్టు రవీందర్‌గౌడ్, గడ్డం రామారావుగౌడ్, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

మన్సూరాబాద్, అక్టోబర్ 26: ట్రాఫిక్‌ను దారి మళ్లించి యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ కోరారు. నాగోల్ డివిజన్ పరిధి బండ్లగూడ నుంచి ఆనంద్‌నగర్ చౌరస్తా మార్గంలో నిలిచిపోయిన రోడ్ల నిర్మాణ పనులను శనివారం సంబంధిత అధికారులు, ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ డి.వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేసి రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వాహనాలను దారి మళ్లించడం ఇబ్బందిగా ఉండటంతో ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులకు అడ్డంకులు ఏర్పడుతున్నాయన్నారు. రోడ్ల నిర్మాణాల కోసం ట్రాఫిక్ పోలీసులు సహకరించి వాహనాలను దారి మళ్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ దిలీప్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## 100 కోర్సులు పూర్తి చేసిన 8 మంది జీఎస్ఐ ఉద్యోగులకు సన్మానం

మన్సూరాబాద్, అక్టోబర్ 26: ఐజీఓటీ కర్మయోగి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా 100 కంటే ఎక్కువ కోర్సులను పూర్తి చేసిన వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులను ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర గనుల మంత్రి జి.కిషన్‌రెడ్డి సన్మానించారు. ఎల్బీనగర్, బండ్లగూడ జీఎస్ఐ శిక్షణా సంస్థకు చెందిన ఎనిమిది మంది కోర్సులను పూర్తి చేసిన వారిలో ఉన్నారు. ఐజీఓటీ కర్మయోగి పోర్టల్‌లో 100 కంటే ఎక్కువ కోర్సులను పూర్తి చేసిన ఎల్బీనగర్, బండ్లగూడ జీఎస్ఐకి చెందిన కెమిస్ట్ పప్పు భౌమిక, అసిస్టెంట్ అజి థామస్, జియోఫిజిక్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జ్ఞానేష్ లష్కరీ, సూపరింటెండెంట్ జియాలజిస్ట్ బిను వర్గీస్ థామస్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ లయీకా సుల్తానా, సీనియర్ కెమిస్ట్ శ్రీనివాసరావు పంగులూరి, డ్రైవర్ మనోజ్‌కుమార్ మీనా, జియాలజిస్ట్ జూలీ జైస్వాల్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అవార్డులను అందజేశారు. డిజిటల్ ఇండియాలో భాగంగా ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ఐజీఓటీ కర్మయోగి ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌ను ఏర్పాటు చేసిందని ఉద్యోగులు తెలిపారు. జీఎస్ఐ ఉద్యోగులందరూ ఐజీఓటీ కర్మయోగి పోర్టల్‌లో చేర్చబడ్డారన్నారు. సంస్థ సూచించిన కోర్సులను ఎనిమిది మంది జీఎస్ఐ ఉద్యోగులు విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన

బడంగ్‌పేట, అక్టోబర్ 26: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఏ.శంకర్ రెడ్డి తెలిపారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మన తెలుగు ఫౌండేషన్, మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సన్స్ హాస్పిటల్ సహకారంతో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి.. వైద్య పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వారికకి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇంద్రావత్ రవి నాయక్, చవ్వ శ్రావన్ కుమార్, మల్లేశ్, గాజుల మధు, తదితరులు ఉన్నారు.

### కమిషనర్ల బదిలీలు

బడంగ్‌పేట, అక్టోబర్ 26: మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీ, బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. బడంగ్‌పేట కమిషనర్‌గా ఉన్న రఘుకుమార్‌ను సీడీఎంఏ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో అలంపూర్ కమిషనర్ సరస్వతిని బడంగ్‌పేట కమిషనర్‌గా బదిలీ చేశారు. మీర్‌పేట కమిషనర్ చంద్ర శేఖర్‌ను ఘట్‌కేసర్ కమిషనర్‌గా ఆయన స్థానంలో మెక్మాలో పనిచేసిన ఆర్.జ్ఞానేశ్వర్‌ను మీర్‌పేట కమిషనర్‌గా బదిలీ చేశారు. తుకుగూడ కమిషనర్ వెంకట్రామ్‌ను జల్‌పల్లి కమిషనర్‌గా, జల్‌పల్లి కమిషనర్ వాణిదేవిని తుక్కుగూడ కమిషనర్‌గా బదిలీ చేశారు. వీరందరు సోమవారం నాడు బాధ్యతలు తీసుకోనున్నారు.

## పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి



సైదాబాద్ హౌజింగ్ బోర్డు కాలనీలో స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్, అక్టోబర్ 26: పారిశుధ్య నిర్వహణ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కాలనీ, బస్తీల్లో చెత్తాచెదారం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బందిని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి ఆదేశించారు. శనివారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. డివిజన్‌లో ముందుగా రెడ్డిబస్తీ, హరిజన్ బస్తీ, న్యూ సైదాబాద్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లో వ్యర్థాలను తొలగింపు పనులను సిబ్బంది కొనసాగించాలన్నారు. డివిజన్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి కాలనీ, బస్తీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జీహెచ్ఎం మలక్‌పేట సర్కిల్ ఏఎంహెచ్‌వో అనురాధ, జవాన్ నర్సింగ్ రావు, ఎస్ఎఫ్ఏ చంద్రప్రసాద్, మహేందర్, రాజు, సుధీర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### స్పెషల్ డ్రైవ్‌లతో చెత్త తొలగింపు

మలక్‌పేట, అక్టోబర్ 26: మూసారాంబాగ్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో రహదారులు, పార్కుల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగిస్తున్నట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీమధుసూదన్‌రెడ్డి తెలిపారు. సలీంనగర్‌లోని సౌత్ వెస్ట్ పార్కులో పేరుకుపోయిన చెత్తను శనివారం స్పెషల్ డ్రైవ్ ద్వారా తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బొక్క మధుసూదన్‌రెడ్డి, ఏఎంహెచ్ఓ అనురాధ, జవాన్ రమేశ్, సూపర్‌వైజర్లు శ్రీను నాయక్, నర్సింగ్‌రావు, అక్షయ్, కాలనీవాసులు ఓంప్రకాశ్, దినేశ్, తదితరులు పాల్గొన్నారు.



## హరీశ్‌రావును కలిసిన యాదవ సంఘం నేతలు

నవంబర్ 1న శుక్రవారం రాత్రి సైదాబాద్‌లో జరిగే యాదవ సదర్ మేళాకు హాజరు కావాలని కోరుతూ యాదవ సదర్ మేళా ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి టి.హరీశ్‌రావుకు అందజేస్తున్న సైదాబాద్ యాదవ సంఘం కార్య నిర్వహణ అధ్యక్షుడు బత్తుల మహేందర్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల మల్లేశ్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచబోయిన శ్రీహరియాదవ్, ఎం.రాజేందర్ యాదవ్ తదితరులు – సైదాబాద్, అక్టోబర్ 26

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



మల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చంపాపేట నెహ్రూనగర్ కాలనీ అధ్యక్షుడు బీసుకుంట్ల సతీశ్‌గౌడ్, పి.యాదయ్య

చంపాపేట, అక్టోబర్ 26: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. చంపాపేట డివిజన్ పరిధి కటికోనికుంట, నెహ్రూనగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని శనివారం నెహ్రూనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బీసుకుంట్ల సతీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని.. నియోజకవర్గ పరిధిలోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని కాలనీవాసులకు హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి.యాదయ్య, పి.బాల్‌రాజ్, బీసుకుంట్ల సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.



పీఏసీఎస్ కార్యాలయంలో ఆనంద్‌ను సన్మానిస్తున్న చంద్రశేఖర్, డైరెక్టర్లు, సిబ్బంది

## రైతులకు సంక్షేమానికి కృషి

కందుకూరు, అక్టోబర్ 26: రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. శనివారం పీఏసీఎస్ కార్యాలయంలో డైరెక్టర్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన పొట్టి ఆనంద్‌ను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పది రోజుల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320, రాష్ట్ర ప్రభుత్వం బోనస్ 500 కలుపుకొని రూ.2,820 చెల్లిస్తామని తెలిపారు. అదే విధంగా దొడ్డు రకం వరికి క్వింటాకు రూ.2,300 చెల్లిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సురుసాని శేఖర్‌రెడ్డి, నర్ల నర్సింహ, గౌర పర్వతాలు, గానుగపేట అంజమ్మ, కొరివి యశోధ, తీగల జగదీశ్వర్‌రెడ్డి, సత్తినేని వెంకట్‌రాంరెడ్డి, సాద పాండు రంగారెడ్డి, చంద్ర నాయక్, సీఈఓ నిమ్మ యాదగిరిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



## డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి

మన్సూరాబాద్, అక్టోబర్ 26: మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరితికి జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి వినతి ప్రతం సమర్పించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న నిధులను ఎల్బీనగర్ అభివృద్ధికే కేటాయించాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరారు. చింతలకుంట హర్ష టయోట, మల్లికార్జునగర్ నార్త్ కాలనీ కమాన్, సాయినాథ్ కాలనీ, బ్యాంకుకాలనీ, పద్మావతినగర్, ప్రగతినగర్ కాలనీల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న ట్రంకులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని జడ్సీకి వినతి



ఎల్బీనగర్, అక్టోబర్ 26: కొత్తపేట డివిజన్‌లోని ప్రధాన సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ కార్పొరేటర్ పవన్‌కుమార్ శనివారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని సత్యనగర్, జనప్రియ అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించారు. అదే విధంగా కొత్తపేట డివిజన్‌లో నూతన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేయించాలని, సీసీ రోడ్లు వేయించాలని, వీధి దీపాల కొరత ఉన్నందున నూతన వీధి దీపాలను వేయించాలని కోరారు.